క్లుప్తంగా

నిబంధనలు పాటించడం తప్పనిసరి



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి సూచించారు. పెద్దశంకరంపేటలో నేషనల్ లైవ్ అథారిటీ, 108 సిబ్బందితో కలిసి శుక్రవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, మద్యం సేవించి నడపవద్దని సూచించారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని కోరారు.

చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా శుక్రవారం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ పేద కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతుంద న్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీనర్సయ్య, అశోక్ తదితరులున్నారు.

పీఆర్టీయూ పిలుస్తోంది



తన పాటను ఆవిష్కృతం చేస్తున్న లక్ష్మినారాయణ

పాపన్నపేట(మెదక్): పీఆర్టీయు పిలుస్తోంది..సీపీఎస్ అంతమే.. మా పంతమంటూ గేయం రాసి గానం చేసిన పాపన్నపేట మాజీ మండల పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మినారాయణను మండల శాఖ శుక్రవారం అభినందించింది. లక్ష్మీనారాయణ స్వరాభిషేకం చేసి, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరణ చేయడం సంతోషకరమన్నారు. రాబోయే రోజుల్లో టీచర్ల హక్కుల సాధనలో ఈ పాట, చైతన్య గీతిక అవుతుందన్నారు. కార్యక్రమంలో మండల పీఆర్టీయూ అ. ధ్యక్షులు రాజు ,ప్రధాన కార్యదర్శి సురేష్ ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న రవీందర్ నాయక్

మనోహరబాద్(తూప్రాన్): ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రవీందర్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యమంలో వైద్యురాలు జోత్స్న, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాల్‌నర్సయ్య, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని పాత పంచాయతీ వద్ద హిందూవాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమార్చనను వైభవంగా నిర్వహించారు. కమిటీ అధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పంటల పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. మండలంలో దాదాపు 540 ఎకరాల్లో పంటలు నీటిలో మునిగినట్లు మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ డీఏఓకు వివరించారు. పరిశీలనలో ఏఓ యాదగిరి పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతును ముంచిన భారీ వర్షం

- నీట మునిగిన 1,255 ఎకరాలు
- ఆదుకోవాలంటున్న అన్నదాతలు



రేగోడ్: సంగమేశ్వర తండాలో నీటిలో మునిగిన పత్తి పంట

రేగోడ్(మెదక్): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమయింది. పంటలు నీట మునిగి రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. 1,856 మంది రైతులకు చెందిన 1,255 ఎకరాల్లో వేసిన వరి, పత్తి, కంది, మినుము, పెసర పంటలు నీట మునిగాయి. పంటలన్నీ నీటిలో తేలాడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టం అందించాలని రైతులు కోరుతున్నారు.

286 ఎకరాల్లో పంట నష్టం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో 286 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ఏఓ స్వప్న తెలిపారు. శుక్రవారం ఏఓ మాట్లాడుతూ భారీ వర్షాలతో వివిధ గ్రామాల్లో చెరువు శిఖం మునగడంతో వరిపంటలు నీటి మునిగాయన్నారు. దీంతో పాటు అలుగు పారడంతో వరిపంటకు నష్టం వాటిల్లిందని చెప్పారు. మొత్తం 286 ఎకరాల్లో పంటనష్టం జరిగిందన్నారు. కాగా, పంట నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరారు.

రామాని చెరువుకు గండి

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్ రామాని చెరువుకు శుక్రవారం వేకువ జామున గండి పడింది. ఆయకట్టు రైతులు గమనించి ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆయకట్టు రైతులు, ఇరిగేషన్ శాఖ సిబ్బంది కలిసి జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో గండిని పూడ్చారు.

చెరువులను తలపిస్తున్న పొలాలు

కొల్చారం(నర్సాపూర్): భారీ వర్షాలతో మండలంలో ఎక్కడ చూసినా పంట పొలాలు చెరువులు, కుంటలను తలపిస్తున్నాయి. చెరువులు అలుగులు పారడంతో దిగువనున్న పంట పొలాల్లోకి నీరు వచ్చి చేరింది. దీంతో పంట చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. వర్షానికి ఇండ్లు కూలిన బాధితులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అధికారుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి సాయం అందలేదని తెలిపారు. తుక్కాపూర్‌లో గత మంగళవారం మంజీరాలో గల్లంతైన టేక్మాల్ ప్రమీల ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆచూకీ కనుగొనాలని కోరారు.

నీట మునిగిన 520 ఎకరాలు

చిలిప్‌చెడ్(నర్సాపూర్): భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా సుమారు 520 ఎకరాల్లోని పంట నీట మునిగినట్లు వ్యవసాయధికారుల అంచనా వేశారు. మండలంలోని గంగారం, అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్, చండూర్, చిట్కుల్ గ్రామాలు మంజీరా పరివాహక ప్రాంతంలో ఉండటంతో, ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా దాటికి సైతం పలు పంటలు నీట మునిగాయి. మునిగిన పంట వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఏఓ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు.



కౌడిపల్లి(నర్సాపూర్): కూకుట్లపల్లిలో చెరువు నీటిలో పంట మునిగిందని చూపుతున్న రైతు

సురక్షిత ప్రాంతాలకు 9 కుటుంబాలు

రామాయంపేట(మెదక్): వరద ముప్పు పొంచి ఉండటంతో మండలంలోని పన్యాతండాకు చెందిన తొమ్మిది కుటుంబాలను శుక్రవారం సాయంత్రం జోన్ షెల్టర్‌కి తరలించారు. వరద నీటితో నిండిపోయిన కాట్రియాల పెద్ద చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉండడంతో తహసీల్దార్ రజనీకుమారి తండాను సందర్శించారు. ఈ మేరకు బాధిత కుటుంబాలను గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తరలించారు. బాధిత కుటుంబానికి ఆమె బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.

భారీ వర్షాలతో పంట నష్టం

రామాయంపేట(మెదక్): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో డివిజన్ పరిధిలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌నారాయణ అన్నారు. శుక్రవారం ఆయన రామాయంపేట మండలంలో పంటచేలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలం పరిధిలో 1,687 ఎకరాల మేర పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఈ మేరకు ఆయా మండలాల పరిధిలో ఏఈవోలు, ఏవోలు సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. చాలా పొలాల్లో ఇసుక మేటలు వేసిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తమ పంట చేలకు క్రిమి సంహారక మందు చల్లవద్దని, నీటిని తొలగించాలని సూచించారు.

దెబ్బతిన్న పంటలు

శివ్వంపేట(నర్సాపూర్): భారీ వర్షాల మూలంగా మండలంలో వరి పంటకు తీవ్ర నష్టం జరిగింది. వరదతో పాటు చెరువులు, కుంటలు నిండడంతో బ్యాక్ వాటర్ వల్ల వందల ఎకరాల్లో పంటలు మునిగిపోయాయి. నీటి ప్రవాహం వల్ల వరి పంటల్లో ఇసుక మేటలతో నిండిపోయాయి. పాడైన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. దీంతో పాటు మండలంలో రెండు ఇండ్లు పూర్తిగా కూలిపోవడంతో పాటు 85 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.



నర్సాపూర్ రూరల్: గండిని పూడుస్తున్న రైతులు, ఇరిగేషన్ సిబ్బంది

కుంగిన రోడ్డు.. నిలిచిన రాకపోకలు

నిజాంపేట(మెదక్): మెదక్ నుంచి వ్యాపారస్తులు సిద్దిపేట, దుబ్బాక మండలాలకు తరలివెళ్తుంటారు. కాని ఈ దారిలో మండలంలోని నందిగామ శివారులో సాయి చెరువు పొంగి పొర్లడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో మెదక్ నుంచి ఆర్టీసీ బస్సులు రామాయంపేట వరకు మాత్రమే నడుస్తున్నాయి. అలాగే ఇక సిద్దిపేట నుంచి వచ్చే వాహనాలు నిజాంపేట వరకు నడుస్తున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామాయంపేట నుంచి నిజాంపేట ప్రయాణికులు, వ్యాపారస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే రహదారి పునరుద్ధరించాలని కోరుతున్నారు.

తెగిన రోడ్లు.. చెరువులకు గండ్లు

నర్సాపూర్‌రూరల్: భారీ వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు తెగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖాజీపేట తండా రోడ్డుకు ఇరువైపులా గండ్లు పడటంతో తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. ఓవైపు కాళేశ్వరం ప్రాజెక్ట్ కాలువ, మరోవైపు వాగు ఉండటంతో ఖాజీపేట తండా రోడ్డుకు ఇరువైపులా గండి ఏర్పడి రాకపోకలు నిలిచిపోయాయి. నర్సాపూర్ ఆర్‌డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, రోడ్డును పరిశీలించి రాకపోకలు చేయరాదని తండావాసులకు సూచించారు. లింగాపూర్ కొమ్ముస్ చెరువు అలుగు పారడంతో పంటపొలాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. గొల్లపల్లి నాగనికుంట ఆయకట్టు వరిపొలాలు నీటమునిగిపోయాయి. అలాగే మహ్మదాబాద్ పెద్దచెరువుకు గండి పడింది. గతంలో పడినచోటే మరోసారి గండపడటంతో పూడ్చివేయగా ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.



నిజాంపేట(మెదక్): నందిగామ గ్రామ శివారులో కుంగిన రోడ్డు



రామాయంపేట(మెదక్): రామాయంపేటలో వివరాలు నమోదు చేసుకుంటున్న ఏడీఏ



నర్సాపూర్‌రూరల్: ఖాజీపేటతండా రోడ్డుకు ఇరువైపులా వరద ప్రవాహం

కూలిన బ్రిడ్జిని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

హవేళిఘణాపూర్(మెదక్): మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండల పరిధిలో మక్తభూపతిపూర్-మెదక్ వెళ్లే రోడ్డుపై కూలిపోయిన బ్రిడ్జిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు హవేళిఘణాపూర్, మెదక్ మండలాల్లో కొట్టుకుపోయిన రోడ్లను అధికారులు తాత్కాలికంగా మరమ్మత్తులు చేస్తున్నారన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌చౌదరి, అశోక్, చంద్రపాల్, శంకర్, సుభాష్‌చంద్రబోస్, వెంకటరమణ, హఫీజుద్దీన్ ఉన్నారు.



మక్తభూపతిపూర్ వద్ద కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న హన్మంతరావు

ప్రజల్ని ఆదుకోవడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

మెదక్ కలెక్టరేట్: గత రెండు రోజులుగా జిల్లాలో కురిసిన వర్షాలతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. మెదక్ జిల్లాకు వచ్చిన ఆయన హవేళిఘనపూర్ మండలంలో శుక్రవారం పర్యటించారు. అనంతరం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్‌భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోచారం ప్రాజెక్టు ప్రమాదంలో ఉందని, ప్రాజెక్టుకు మరమ్మతులు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రాజెక్టు ప్రమాదంలో ఉందని తెలిసినా ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వరదలకు రోడ్లు తెగిపోవడంతో జిల్లా కేంద్రం నుంచి 70 వరకు గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. ఇద్దరు నీటిలో కొట్టుకుపోయి మృత్యువాత పడినట్లు తెలిపారు. ధూప్‌సింగ్ తండా నీటమునిగినా..సహాయక చర్యలు అందించడంలో జిల్లా యంత్రాంగం స్పందించడం లేదని ఆరోపించారు. పంట నష్టం పై కేంద్రం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నరసింహారావు, అడివయ్య, వెంకట్రాములు, మెదక్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ, కామారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్ర శేఖర్, మెదక్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.మల్లేశం, కె.మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మరమ్మతులు

నెల రోజుల్లోనే మళ్లీ పడిన గుంతలు

నర్సాపూర్ : జాతీయ రహదారిపై స్థానిక చౌరస్తాలో గుంతలకు మొక్కుబడిగా మరమ్మతులు చేయించారని ఆరోపణలు వస్తున్నాయి. గత నెల 28న సాక్షిలో 'గుంతలను పట్టించుకోని అధికారుల' కథనానికి జాతీయ రహదారుల శాఖ అధికారులు స్పందించి అదే రోజు మరమ్మతులు చేయించారు. కాగా చౌరస్తాలో గత వారం రోజులుగా మళ్లీ చిన్న చిన్న గుంతలు ఏర్పడ్డాయి. కాగా వర్షాలు కురుస్తున్నందున గుంతలు రోజు రోజుకు పెద్దవిగా మారుతున్నాయి. గతంలో మరమ్మతులు చేసిన ప్రాంతంతో పాటు రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురుస్తున్నందున గుంతల్లో నీరు నిలిచి, గుంతల్లో రాళ్లు పెట్టడంతో నీళ్లు ఉన్నప్పుడు రాళ్లు కన్పించక ఇబ్బందులకు గురవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారైనా పకడ్బందీగా మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



జాతీయ రహదారి నర్సాపూర్ చౌరస్తాలో ఏర్పడిన గుంతలు, అందులో పెట్టిన రాళ్లు

ఓట్ల చోరీపై 'యూత్' కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శనలో కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కాగడాల ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కాగడాల ప్రదర్శన చేపట్టినట్లు ఆయన చెప్పారు. తమ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన ఈ ఉద్యమానికి తాము అండగా ఉంటామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పవిత్రమైందన్నారు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తూ ఓట్ల చోరీకి పాల్పడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తరుణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన 'ఇండియన్ ఈడిల్' లభ్యం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ప్యాటగడ్డ పాతచెరువు అలుగులో అరుదైన చేప లభ్యమైంది. ఇండియన్ ఈడీల్ ఫిష్‌గా పిలిచే సముద్రపు చేపగా అధికారులు దానిని గుర్తించారు. పొడవైన, సన్నని శరీరంతో పదునైన దంతాలతో పొడుగు ముక్కుతో కూడిన చేపపిల్ల లభ్యమైంది. ఇది మంచినీటి చెరువులు, నదులలో మాత్రమే జీవిస్తుందని, ఇతర చేపలను ఆహారంగా తీసుకుంటుందని ఫిషరీస్ అధికారులు చెప్పారు. చాలా అరుదుగా లభించే ఈ చేపను ఇండియన్ ఫిష్ లేదా గార్ఫిష్ అని పిలుస్తారని మెదక్ జిల్లా మత్స్యశాఖ సహాయ అధికారి నరేశ్ తెలిపారు.



ప్యాటగడ్డలో లభ్యమైన అరుదైన చేప

ప్రజలకు సేవలందించడంలో నిర్లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): విపత్తు పరిస్థితుల్లో అధికారులు ప్రజలకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాయిన్‌పల్లి ప్రాజెక్టును పరిశీలించారు. పుష్పల వాగు వరద ఉధృతితో రైతుల పంట పొలాలకు అందించే పంపింగ్ ఛానెల్ కొట్టుకుపోవడంతో 2వేల ఎకరాలకు పంటలకు నీరందించకుండా పోతుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట జెడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్య రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు కిష్టయ్య ,రవీందర్ తదితరులు ఉన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్డీఓకు బీజేపీ నాయకుల వినతి

తూప్రాన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆర్డీఓ జయచంద్రారెడ్డికి ఆయన కార్యాలయంలో బీజేపీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. అనంతరం బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు జానకిరామ్‌గౌడ్, మండలశాఖ అధ్యక్షుడు పోచయ్యలు మాట్లాడుతూ.. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆర్డీఓకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విఠల్, యాదగిరి, మహేశ్‌గౌడ్, కిషన్ తదితరులున్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

మెదక్‌జోన్: నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం టీఎన్‌జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ భాగస్వామ్య సంఘాలతో కలిసి మాట్లాడారు. నూతన పెన్షన్ విధానం (సీపీఎస్) ఉద్యోగులకు ప్రమాదకరంగా మారిందన్నారు. పాత పెన్షన్ సాధన కోసం సంఘటితంగా ఉద్యమ కార్యచరణ రూపొందించాలన్నారు. అన్ని వర్గాల ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు కలిసి రావాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పద్మారావు, శ్రీనివాస్ టీఎస్జీవో జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఉద్యోగ జేఏసీ చైర్మన్ నరేందర్

పరిహారం అందజేత

తూప్రాన్: భారీ వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రెవెన్యూ అధికారులు పరిహారం అందజేస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు కురిసిన భారీ వర్షాలకు మొత్తం 26 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో బాధితుల బ్యాంకు ఖాతాల్లో రూ.3,200 చొప్పున పరిహారం అందజేస్తున్నామని తెలిపారు.

అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలి

ఎంపీడీఓ మధులత

నర్సాపూర్ రూరల్: గ్రామ పంచాయతీల వద్ద ప్రదర్శనకు ఉంచిన ఓటరు జాబితాలపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని నర్సాపూర్ ఎంపీడీఓ మధులత, ఎంపీఓ వైద్య శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని 34 గ్రామ పంచాయతీల వద్ద ఓటరు జాబితాలను ప్రజల కోసం ప్రదర్శనకు ఉంచినట్లు చెప్పారు. ఆయా గ్రామస్తులు ఏవైనా అభ్యంతరాలతో పాటు తమ పేర్లు ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే గ్రామ కార్యదర్శి, బూత్ లెవెల్ అధికారులకు విన్నవించాలని తెలిపారు. సెప్టెంబర్ 2వ తేదీన ఫైనల్ ఓటరు జాబితాల ప్రదర్శనకు ఉంచనున్నట్లు తెలిపారు.

వాటా భూమి ఇప్పించండి

ఆర్‌డీఓకు నర్సాపూర్‌కు చెందిన అశోక్ వినతి

నర్సాపూర్: తమ ఉమ్మడి భూమిలో అక్రమ నిర్మాణాన్ని నిలిపి వేసి తన వాటా తనకు ఇప్పించాలని నర్సాపూర్‌కు చెందిన మంగళి అశోక్ స్థానిక ఆర్‌డీఓ మహిపాల్‌రెడ్డిని కోరారు. తమ తండ్రి నర్సింహులుకు ప్రభుత్వం 731/5 సర్వే నంబరులో రెండెకరాల 20గుంటల భూమి అసైన్‌మెంటు కింద ఇచ్చిందని, తమ తండ్రి తదనంతరం తమ తల్లి పేరు మీదకు మార్పు చేయించామని చెప్పారు. అయితే తమకు తెలియకుండా తమ అన్న కృష్ణ, అతని భార్య లావణ్య పేరు మీదకు ఉమ్మడి భూమిని మార్పు చేయించుకున్నారని అశోక్ ఆరోపించారు. తమకు వాటా ఇవ్వాలని అడిగితే ఇవ్వడం లేదని వాపోయాడు. తమకు తెలియకుండా అసైన్‌మెంటు భూమిలో పది గుంటల భూమిని అమ్మివేశారని, తమ భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి అనుమతుల్లేకుండా అక్రమంగా భవన నిర్మాణాలు చేపట్టాడని గోడు వెళ్లబోసుకున్నాడు. దీనికి స్పందించిన ఆర్డీఓ విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్‌కు ఆదేశించారు.

వారందరికీ త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు



టార్పాలిన్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

ఎమ్మెల్యే రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): భారీ వర్షాలతో ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే రోహిత్ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌లో నివాస గృహాలు దెబ్బతిన్న బాధితులకు గ్రామానికి చెందిన అహ్మద్ అక్బర్ సహకారంతో ఎమ్మెల్యే టార్పాలిన్లు అందజేశారు. గ్రామంలో భారీ వర్షంతో ఇళ్లు దెబ్బతిన్నవారికి సహాయం అందించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.

పార్టీలకతీతంగా ఇవ్వాలి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు వెంటనే చెక్కులు అందించాలని కోరుతూ ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాదిన్నర నుంచి ఎమ్మెల్యే సంతకాలు పెట్టకుండా పెండింగ్‌లో ఉంచడంతో లబ్ధిదారులకు చెక్కులు రావడం లేదన్నారు. అందరికీ కల్యాణలక్ష్మి చెక్కులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పెద్దశంకరంపేటలోని ఇందిరాకాలనీ, వడ్డెరవాడలో వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయాలి

నిజాంపేట(మెదక్): మండల పరిదిలోని కల్వకుంట పంచాయతీల వద్ద ప్రదర్శనకు ఉంచిన ఓటర్ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని పంచాయితీ కార్యదర్శి కవిత పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే గ్రామ కార్యదర్శి, బూత్ లెవెల్ అధికారులకు విన్నవించాలని తెలిపారు. సెప్టెంబర్ 2వ తేదీన ఫైనల్ ఓటర్ జాబితాల ప్రదర్శనకు ఉంచనున్నట్లు చెప్పారు.